క్లుప్తంగా

తేనేపల్లెలో 'వికసిత్ భారత్'



వికసిత్ భారత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు

పూతలపట్టు: మండలంలోని తేనేపల్లె, పేట అగ్రహారం పంచాయతీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై అధికారులు ప్రచార రథం ద్వారా పంచాయతీ ప్రజలకు కేం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులుంటే చెప్పండి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో శివయ్య

పూతలపట్టు: పోలింగ్ స్టేషన్ మార్పుల్లో తప్పు లుంటే చెప్పాలని రాజకీయ నాయకులను ఈఆర్వో శివయ్య కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గంలో 260 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అందులో పోలింగ్ స్టేషన్ భవనాల పరిస్థితి క్షీణించి ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వంటి ఉన్నట్లైతే వాటిని బీఎల్వోలు, తహసీల్దార్‌కు తెలియజేస్తే సరిచేస్తారని తెలిపారు. అనంతరం పోలింగ్ బూత్‌ల గురించి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, డీటీ మహేశ్వరి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత కలెక్టర్‌తో తహసీల్దార్ భేటీ



విశ్రాంత కలెక్టర్ నరసింగరావు కుటుంబసభ్యులతో తవణంపల్లె తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి

తవణంపల్లె: జిల్లాలో 1996–1998లో జిల్లా కలెక్టర్‌గా పని చేసి, ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కలెక్టర్ నరసింగరావును మంగళవారం తవణంపల్లె తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నరసింగరావు కుటుంబసమేతంగా మంగళవారం కాణిపాకంలో వినాయక స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. వినాయకస్వామివారి దర్శనం తర్వాత ఆలయం బయట తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బంది నరసింగరావును కలసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

గుడిపాల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలు, అక్రమంగా మద్యం అమ్మకాల నియంత్రణపై మంగళవారం రాత్రి పిళ్లారికుప్పంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిళ్లారికుప్పం పరిసర ప్రాంతాల్లో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు తమకు సమాచారం ఉందని, దీనికి స్వస్తి పలకకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మెసేజ్‌ల రూపంలో మోసగిస్తున్నారని, దీనిపై అలర్ట్‌గా ఉండాలన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎవరూ గొడవ పడరాదని హితవు పలికారు. ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం పంపిణీ



బాధితునికి చెక్కును అందజేస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల గుడిపాల మండలం కొత్తపల్లె పంచాయతీ మిట్టూరులో ఏనుగు దాడిలో రమణారెడ్డికు చెందిన ఆవు మృతి చెందింది. బాధిత రైతుకు ప్రభుత్వం తరఫున మంగళవారం రూ.50 వేల ఆర్థిక సాయం చెక్కును మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు స్థానిక మార్కెట్‌చౌక్ వద్ద అందజేశారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి

- మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



మార్కెట్ చౌక్ వద్ద అన్నదానం చేస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: పేదల బతుకులు మరింత మారాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పునరుద్ఘాటించారు. మంగళవారం స్థానిక జానకారపల్లె, రంగాచ్చారివీధి సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. తొలుత సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల లబ్ధి సమాచార డిస్‌ప్లే బోర్డు, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. మార్కెట్ చౌక్‌లోని శివమందిరంలో స్వామివారికి పూజ చేశారు. అనంతరం కార్పొరేటర్ నజీర, డివిజన్ ఇన్‌చార్జి అల్తాఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. భారీ ఊరేగింపు నడుమ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుని మేయర్, ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. డివిజన్ మొత్తం ఇప్పటి వరకు దాదాపు రూ.13 కోట్లు ఖర్చు చేశామని, డివిజన్ పరిధిలో 7 బోర్లు వేశామన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన.. ఇలా విద్య కోసమే రూ.2 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. జైహింద్ మున్సిపల్ పాఠశాలను దాదాపు రూ.30 లక్షలతో నాడు–నేడు కింద ఆధునీకరించారన్నారు. ప్రతి డివిజన్‌లో ధైర్యంగా ఏ పథకానికి ఎంత ఖర్చు పెట్టామో తెలిపే విధంగా డిస్‌ప్లే బోర్డులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, మహిళా జిల్లా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, సచివాలయ నగర కన్వీనర్ రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్ లక్ష్మణస్వామి, పూర్ణ నాయకులు షరీఫ్, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.



రంగాచ్చారివీధి సచివాలయం వద్ద సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే

పేదల ఆరోగ్యానికి భరోసా



తవణంపల్లె: ఎగువ మత్యంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనం వైద్యులు ఈ సందర్భంగా 65 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

బంగారుపాళెం: మండలంలోని ఈచనేరిపల్లె, చీకూరుపల్లె గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను నిర్వహించారు. ఎఫ్‌పీసీ డాక్టర్ రమేష్ గర్భిణులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి రాలేని రోగుల ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై సూచనలు, సలహాలను అందజేశారు. డాక్టర్లు మాట్లాడుతూ పల్లె ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదవానికి వైద్య పరీక్షలు చేస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎగువ మత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 57 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, తులశమ్మ, ఆశా కార్యకర్తలు షీబా, లక్ష్మీ, రేణుక పాల్గొన్నారు.

చిత్తపారలో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. మంగళవారం చిత్తపారలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, మధుమేహం రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్ర, హేమలత, ఇందుమతి, మంజుల పాల్గొన్నారు.



ఐరాల : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



చిత్తపారలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు జ్ఞాన జగదీష్, టిమ్ములు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అరగొండరోడ్డు, మంగసముద్రం, ఓబనపల్లె, 190 రామాపురం డివిజన్లలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారన్నారు.

అక్కడ కూడా ఈ-శ్రమ్ కార్డులు

చిత్తూరు కార్పొరేషన్: అసంఘటిత రంగ కార్మికులకు ఇచ్చే ఈ-శ్రమ్ కార్డులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో కూడా పొందవచ్చని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్ రావు తెలిపారు. మీ-సేవ, సీఎస్‌సీ, గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అదనంగా సంఘాలలో కూడా సేవలను అందుబాటులో తెచ్చారన్నారు. సన్న, చిన్నకారు రైతుల సౌలభ్యం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని అందుబాటులో ఉంచారని చెప్పారు. కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడినా, మరణించినా రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

నల్ల మందు పేలి ముగ్గురికి గాయాలు

చిత్తూరు అర్బన్: బండ రాళ్లను కొట్టే సమయంలో నల్లమందు పేలడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం.. యాదమరికి చెందిన ఇస్మాయిల్, ముబారక్, అస్గర్ అలీని చిత్తూరులోని బోడికొండ వద్ద రాళ్లు కొట్టడానికి మేస్త్రీ మురుగన్ తీసుకొచ్చాడు. సోమవారం వారు రాళ్లు కొట్టడానికి నల్లమందు పెడుతుండగా ఒక్కసారిగా పేలింది. దీంతో ముగ్గురూ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక వీఆర్‌ఓ సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు మేస్త్రీ మురుగన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: స్థానిక గిరింపేటలోని విద్యుత్ ఉద్యోగుల క్వార్టర్స్‌లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం టూటౌన్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ ఉలసయ్య తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 6950 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో వారు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులని తేలింది.

నగరంలో కనిష్ట స్థాయికి వాయు కాలుష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పరిధిలో వాయు కాలుష్యాన్ని కనిష్ట స్థాయికి తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ జె. అరుణ అన్నారు. ఎన్‌క్యాప్ జిల్లాస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం మంగళవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించారు. సీపీసీబీ రీజినల్ డైరెక్టర్ కరుణాకర్, గాదంకి ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్తల బృందం, కమిటీ సభ్యులు, కమిటీలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎన్‌క్యాప్ నిధులతో చేపట్టిన పనులపై దృశ్య మాధ్యమంతో కమిషనర్ వివరించారు. నగరంలో ప్రధాన కూడళ్లలో గ్రీనరీ పనులు, డివైడర్ల నిర్మాణం, ఫౌంటెన్ల ఏర్పాటు వల్ల సంబంధిత ప్రాంతాల్లో గాలిలో నాణ్యతను వీలైనంతగా పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మిగిలిన కొన్ని పనులను జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నగరంలో గాలి నాణ్యతపై ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్తలు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకించారు. నగరంలో గాలి కాలుష్యం ఏ ఏ కాలాల్లో, ఏ ప్రాంతాల్లో ఏ విధంగా నమోదు అవుతుంది? వీటిని తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలను వివరించారు. కమిటీలోని శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ నగరంలో వాయు కాలుష్యం తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా ఇండస్ట్రియల్, ట్రాఫిక్ రద్దీ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గాలి నాణ్యతకు సంబంధించి గిరింపేట పార్కులో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులో ఎప్పటికప్పుడు వివరాలను నమోదవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ శాస్త్రవేత్త సుధాకర్, ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్త వికాస్ సింగ్, ఎంఈ గోమతి, ఎంహెచ్ఏ డాక్టర్ లోకేష్, వ్యవసాయ, పరిశ్రమల శాఖ ఏడీలు, రవాణా, పోలీసు అధికారులు, డీఈలు, ఏఈలు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కార్మికులతో కమిషనర్ మాటామంతి



కార్మికులతో మాటా-మంతి నిర్వహిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ అరుణ మాటామంతి నిర్వహించారు. మంగళవారం ఉదయం మసీదుమిట్ట వద్ద కార్మికులతో కలిసి కాఫీ తాగుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం కార్పొరేషన్ నుంచి తమవంతు సహకారం ఇస్తామన్నారు. విధుల్లో ఉన్నప్పుడు చేతి గ్లౌవ్స్, రేడియం స్టిక్కర్ కలిగిన జాకెట్ విధిగా ధరించాలన్నారు. అలాగే ప్రజలతో మర్యాదగా మెలగాలని, క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) ఉద్దేశాన్ని తెలియజేసి అవగాహన కల్పించాలని కమిషనర్ క్లాప్ మిత్రలు, డ్రైవర్లకు చెప్పారు. కార్మికుల వినతిపై ఆమె స్పందించారు. చెత్తసేకరణకు సంచులు తెప్పించి వారికి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ గిరింపేట పరిధిలో క్లాప్ వాహనం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరసింహ, చిన్నయ్య, లోకనాథం, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

'ఆడుదాం–ఆంధ్ర'పై సమీక్ష

కార్పొరేషన్ పరిధిలో నిర్వహించాల్సిన 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ, ఆస్తిపన్ను వసూళ్లపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆడుదాం–ఆంధ్ర నిర్వహణకు సంబంధించి వార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్ వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన బృందాల ద్వారా మైదానాలను సిద్ధం చేసే పనులను వేగవంతం చేయాలన్నారు. నగరపాలక పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని, దీర్ఘకాలిక, మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు

సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలి



బంగారుపాళెం: బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఐరాల: సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ దామోదర్‌నాయుడు, హెచ్ఎం

బంగారుపాళెం: విద్యార్థులు సైన్స్ ప్రయోగాల ద్వారా పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వాటి పని తీరు, ప్రయోజనాలను గురించి వివరించారు. మండలంలోని తుంబకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నమూనాలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రమేష్‌బాబు, హెచ్ఎంలు రాజేంద్ర, చెంగల్‌రెడ్డి, పార్థసారథి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఐరాల: విద్యార్థులు వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ దామోదర్‌నాయుడు సూచించారు. మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను హెచ్ఎం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈఓ ప్రారంభించి, విద్యార్థుల ప్రావీణ్యాన్ని పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సైన్స్ విజ్ఞానంపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాల కన్నా ప్రయోగాల ద్వారా నేర్చుకుంటే విద్య చిరకాలం గుర్తుంటుందని తెలిపారు. వ్యక్తిగత ప్రాజెక్ట్ విభాగంలో నీటి సంరక్షణపై మహేశ్వరి, గగన్, గ్రూపు రూపొందించిన ప్రాజెక్ట్ విభాగంలో డ్రైనేజ్ క్లీనింగ్ రోబోట్, మానవ ప్రేరిత భూతాపంపై జశ్వంత్, భానుప్రకాష్, ప్రియ, దర్శిని ప్రతిభను కనబరచి ప్రథమ స్థాయిల్లో విజేతలైనట్లు తెలిపారు. వీరు జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో పాల్గొంటారని చెప్పారు. జిల్లాస్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఎంఈఓ ఆకాంక్షించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ దామోదర్‌నాయుడు

ఐరాల: విద్యార్థులకు రోజూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ దామోదర్‌నాయుడు సూచించారు. మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజనపథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు తీసుకవచ్చినట్లు తెలిపారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో విధులకు అంగన్‌వాడీ సిబ్బంది



పూతలపట్టు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో అంగన్‌వాడీ కార్యకర్త

పూతలపట్టు: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిలు తమ విధులకు పూర్తి స్థాయిలో హాజరయ్యారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గౌరికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిలు తాము సమ్మె విరమించుకుని, విధులకు హాజరుకానున్నట్లు అర్జీని అందజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనడం తప్పేనని, పంచాయతీ కార్యదర్శుల వద్ద నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను అప్పగించాలని విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఎంపీడీఓ గౌరి పంచాయతీ కార్యదర్శుల వద్ద నుంచి కేంద్రాలను సిబ్బందికి అప్పగించారు. మంగళవారం పూతలపట్టు మండలంలోని 63 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, సిబ్బంది పూర్తిగా స్థాయిలో హాజరయ్యారు. దీంతో యథావిధిగా మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలతో కళకలాడాయి.

సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



బంగారుపాళెం : తుంబకుప్పంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అమరావతి, నాయకులు

బంగారుపాళెం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని తుంబకుప్పం సచివాలయంలో మంగళవారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. పేద ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుంటే సోమరులను చేస్తున్నారని చంద్రబాబు ఎల్లోమీడియాతో కలసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పేదల జీవితాల్లో వెలుగులు నిండాలంటే మళ్లీ జగనన్నను సీఎంని చేసుకోవాలన్నారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లీలావతమ్మ, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, నాయకులు అరుణామల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మంజునాథ్, ప్రభునాయుడు, కిషోర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రొగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఐరాల: బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

ఐరాల: రాష్ట్రంలో జగనన్న చేసట్టిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపిస్తాయని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రేపల్లె సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు వందశాతం అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎవరూ చేయని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ఆశీర్వాదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసీప్రసాద్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.